INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN : 2277-7881; IMPACT FACTOR – 4.527; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 6, ISSUE 5(3), MAY 2017

# Yati Prasala Aavirbhavam (యతిప్రాసల ఆవిర్భావం)

**Dr. G. Jhansi Vani.**
HOD,
Department of Telugu.
Bapatla Arts & Science College,
Bapatla,Guntur District - 522101

**పరిచయం :**

ప్రతి బాషమీద పరభాషా ప్రభావం కొంతైనా ఉంటుంది. తెలుగు భాషను పరిశీలిస్తే వర్ణాలు, పదాలు, ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణ రూపాలు ఇలా ఎన్నో ప్రక్రియలు సంస్కృతభాష నుండి ప్రవేశించాయి. తెలుగు ఛందస్సులో అధికభాగం సంస్కృతానుసరణ మైనప్పటికి యధాతధం కాదు. సంస్కృత ఛందస్సులో లేని యతిప్రాసలు తెలుగు ఛందస్సులో రూపొంది తెలుగు భాషకు స్వతంత్ర ప్రతిపత్తిని, విశిష్టతని చేకూర్చాయి. తెలుగు భాషకు అమూల్యాభరణాలుగా నిలిచిన యతిప్రాసలను తెలుగు భాషేతరులు సైతం ప్రశంసించారు. అటువంటి యతిప్రాసల అవిర్భావాన్ని ఒకసారి పరిశీలిద్దాం.

విషయం :

"శ్రుతిర్మాతా లయ: పితా" అని ఆర్యోక్తి ఇట్టి లయ భాషలో ఏర్పడదానికి గల అనేక కారణాలలో ఒకటి 'వర్ణమైత్రి' వర్ణాలకు మైత్రిని కూర్చడం భాషలో అనాదిగా కన్పిస్తుంది.

మానవుడు ప్రకృతి ప్రియుడు. ప్రకృతి కనుగుణంగా మనస్సు స్పందించడం, దానిని శబ్దరూపంగా వెలువరించడం జరుగుతుంది. తన మనస్సులోని ఆనంద, విచార, భయ, విస్మయావస్థలను వెలువరించేటప్పుడు తనకు తెలియకుండానే లయబద్ధంగా రూపొందించడం జరుగుతుంది. పెళ్ళి పాటలు, లాలి పాటలు, శోఖ గీతాలు ఇలా నిత్య జీవితంలో అనేక వేడుకల సందర్భంగా పాడే గేయాలు లయాత్మకంగా ఉండడానికి కారణం అందులోని వర్ణమైత్రే. అయితే ఇవి ప్రయత్నపూర్వకాలు కావు. ఆయా వర్ణాలను పునరుక్తం చేయడం ద్వారా లయ ఏర్పడుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకొని వాటిని ప్రయోగించుట జరిగుండవచ్చు.

ఒక భావాన్ని పద్యరూపంలోగాని లేక వచన రూపంలో గాని వ్యక్తం చేసేటప్పుడు పాఠకులకు శ్వాస తీసుకోవడానికి, ఇంద్రియాలకు విశ్రాంతిని కలుగజేయడానికి మధ్య మధ్య వ్యవధానమవసరం. అందుకే పద్యాలందు పాదాల విభజన, వచనాలందు అర్ధ, పూర్ణ (, .) విరామ చిహ్నాలేర్పడ్డాయి. కొన్ని పద్యపాదాలందు వర్ణాల సంఖ్య ఎక్కువ ఉన్నప్పుడు పాదమధ్యంలో వ్యవధాన మవసరమవుతుంది. చిన్న పాదాలున్న పద్యాల్లో ఈ వ్యవధానం ప్రతి పాదానికి అవసరం లేదు. కాబట్టే కందాది పద్యాల్లో 2,4 పాదాలందు వ్యవధానమవసరమవుతుంది. ఈ వ్యవధానానంతరం అసంపూర్ణమైన ఆపాదం పున: ప్రారంభమయ్యేటప్పుడు పాదారంభవర్ణాన్ని మరలా ఆ స్థానంలో ఉంచడం తెలుగు భాషలో సంతరించుకుంది. ఇట్టి విధానం కాలక్రమంలో మార్పునొంది ఆ వర్ణానికి సన్నిహితోచ్చారణ కలిగిన వర్ణాలను వాడడం జరిగింది. దీనినే 'వర్ణమైత్రి' అంటాం. ఈ విధానం పద్యాలందేకాక సామెతల్లోను, గేయవాఙ్మయంలోను, ప్రాచీన కాలం నుండే కన్పిస్తుంది. కాబట్టి ఈవర్ణమైత్రి 'దేశీయచ్ఛందానికి'

సంబంధించింది యతిప్రాసల కూర్పుకి లయప్రాధాన్యం వహిస్తుంది. ఈ లయోత్పత్తికి కారణం స్థాన కరణ ప్రయత్నాదుల సామ్యం. లయ శ్రవణానందాన్ని కలిగిస్తుంది. లయాత్మకమైన ఒక పద్యాన్ని వినగానే అర్థం స్పష్టంగా తెలియక పోయినా పామరులు సైతం తల ఊపడానికి అందులోని 'లయ' వారి మనస్సుని రంజింపజేయడమే.

సామెతలందు, గేయ వాఙ్మయమందు ఈ వర్ణమైత్రి వాటిలోని వర్ణాల సంఖ్యను బట్టి 'లయ' కనుగుణంగా ఉండేటట్లు ఏర్పడుతుంటాయి.

ఉదా : "నారు పోసినవాడు నీరు పోయడా"
"చేసేవి లోపాలు, చెపితే కోపాలు"
"నలుగురు నడిచందే బాట, పలువురు పలికిందే మాట"

కేవలం యతులే కాదు ప్రాసయతులు కూడా ఈ సామెతలందు మనం చూడవచ్చు.

ఉదా : ఇదుగో పులి అంటే – అదుగో తోక
అత్తలేని కోడలుత్తమురాలు
ఇల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు

ఒక గేయాలను పరిశీలిస్తే వాటిలోను యతి, ప్రాస, ప్రాసయతి అన్నవి కన్పిస్తాయి. గేయాలందు

**యతులకుదాహరణ**

1. ఒప్పుల కుప్పా – ఒయ్యారి భామా
2. కాళ్ళ గజ్జె – కంకాలమ్మ
   వేగు చుక్క – వెలగమొగ్గ
3. చెమ్మచెక్కా – చేరడేసి మొగ్గ

**ప్రాసకుదాహరణ :–**

కలకల నవ్వే లక్ష్మణ దేవరపుడూ
కలతలు పుట్టెను కపులందరికినీ
కిలకిల నవ్వే లక్ష్మణ దేవరపుడూ
కిలకిల నవ్వగా ఖిన్నుడయె రాజు

**ప్రాసయతికుదాహరణ :**

జోలల్లు పాడితే బాలలకునిద్ర
నాగస్వరము పట్టితే నాగులకు నిద్ర

అయితే సామెతలందు, గేయాలందు ఒక నియమక్షరానికే 'మైత్రి' ఉండాలనే నియమంలేదు. కాని పద్యాలందు మాత్రం నియమితాక్షరానికే ఈ వర్ణమైత్రి పాటింపబడుతుంది. అందుకు కారణం తెలుగు భాషలోని ప్రాచీన రచనల్ని పరిశీలిస్తే ఆ రచనలకి మూలం సంస్కృతం అని తెలుస్తోంది. సంస్కృత భాష నుండి ఇతివృత్తాలను గ్రహించినప్పుడు కొన్ని ఘట్టాలందు శార్దూల, మత్తేభాధి పద్యాల నడకను గ్రహింపవలసిన అవస్యకత ఏర్పడింది. వాటి స్థానాల్లో వేరు వేరు వృత్తాలను వాడవచ్చును కాని అవి అంతగా రాణింపవు. రసాభాసమయ్యే అవకాశముంది కాబట్టి ఆ వృత్తాలను, వాటి గణనియమాన్ని స్వీకరించవలసి వచ్చింది. సంస్కృత పండితులు వారి రచనలందు 'యతి' అనే ఒక నియమాన్ని పాటించారు. పాదమందు విచ్ఛేదాన్ని తద్వారా విశ్రాంతిని కలిగించే యతి స్థానంలో తెలుగు భాషలో అంతకు పూర్వమే పాటింపబడుతున్న "వర్ణమైత్రి" అనే దేశ్య విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విషయాన్ని అనంతుడు తన

ఛందోదర్పణంలో ఇలా స్పష్టం చేశాడు.

"ఎన్నిట యతి రావలెనని
రన్నిట సంస్కృతమునందునగు విచ్ఛేదం
బెన్నిట యతి రావలెనని
రన్నిట( దెలుగునకు మొదలి యక్షరమమరున్" (1–129)

యతి స్థానంలో ఈ 'వర్ణమైత్రి' అను 'వళి'ని వాడడం చేత అర్థమందు మార్పు ఉన్నప్పటికి ఈ యతి, వళి అనునవి పర్యాయ పదాలుగా రూపొందాయి.

'యతులు' ఈ విధంగా తెలుగుభాషలో సంతరించుకున్నాయి.

ఇక ప్రాసను పరిశీలిస్తే ప్రాసమైత్రి సంస్కృత భాషలో లేదనే చెప్పాలి. సంస్కృతంలో 'అనుప్రాసలు' ఉన్నాయి కాని అవి శబ్దాలంకారాలు. "ప్రాస" శబ్దము సంస్కృతం కాని లక్షణం మాత్రం దేశీయమే 'యతి మైత్రి' లా 'ప్రాస మైత్రి' కూడా సామెతలందు, గేయవాఙ్మయమందు ప్రాచీన కాలం నుండే కన్పిస్తుంది.

వర్ణమైత్రి కలిగించే లయ ఏ పాదానికి ఆ పాదం విడిగా ఉంటుంది. కాని ప్రాసమైత్రి ఆపాదించు లయ అన్ని పాదాలకు ఒకే విధంగా ఉంటుంది. అయితే ఈ ప్రాసమైత్రి ప్రాదాల్లో ద్వితీయాక్షరాలకే కలగడానికి కారణం కొన్ని పద్యాలందు (సీసం మొ॥) 'యతి' మైత్రిని పాటించదానికి బదులు ప్రాసయతి పాటింపబడింది. యతి స్థానము తరువాత అక్షరానికి 'ప్రాసయతి' చెప్పబడుతుంది. అంటే పాద ద్వితీయాక్షరానికి, తరువాత అక్షరానికి చెప్పబడింది. ఈ విధానం వల్ల పాద ద్వితీయాక్షరాలకు ప్రాసమైత్రి చెప్పడం ప్రారంభమై ఉండవచ్చు. యతులలా ఉచ్చారణ సాదృశ్యంగల ఇతర వర్ణాలతో మైత్రి చెప్పబడక ఏ వర్ణమునకా వర్ణమే, ప్రాసయందు మైత్రి పాటింపబడుతుంది. ఈ విధానం లయకు రమ్యత్వమాపాదిస్తుంది.

ఈ విధంగా యతిప్రాసలు ఆవిర్భవించి దేశీయ ఛందస్సుగా రూపొంది తెలుగు భాషకు వన్నెను చేకూర్చాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. అనంతా మాత్యుడు – "చందో దర్పణము" వ్యాఖ్య– శ్రీ భాష్యం వెంకట నరసింహ
2. అప్పకవి కాకునూరి – "అప్పకవీయము" వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్
3. దొరస్వామిశర్మ రావూరి – " తెలుగుభాషలో చంధోరీతులు"
4. దొరస్వామిశర్మ రావూరి – "అప్పకవీయ భావ ప్రకాశిక"
5. భీమకవి వేములవాద – "కవి జనాశ్రయము" వ్యాఖ్య టి. భాస్కరరావు